# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త


## ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లపై ఆర్డిఓ సమీక్ష

దొరవారిసత్రం డిసెంబర్ 24 ప్రభాత వార్త.



సూళ్లూరుపేట డివిజన్ పరిధిలోని దొకవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల కేంద్రంలో జనవరి నెలలో టిడిపి ప్రభుత్వం నిర్వహించే ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లపై ఆర్డిఓ కిరణ్మయి అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. నేలపట్టు పక్షులకేంద్రంలోని పరిసరాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం సూళ్లూరుపేట, తడ మ్డల పరిధిలోని పులికాట్ లేక్ తధితర ప్రాంతాలను ఆర్డిఓ కిరణ్మయి, డిస్ట్రిక్ట్‌టూరిజం ఆఫీసరు, నాయుడుపేట డి.ఎస్.పి బుచ్చిబాబు, సూళ్లూరుపేట డి.ఎఫ్.ఓ తధితర అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ,దొరవారిసత్రం మండల తహ సీల్దార్లు, ఎంపిడిఓలు, సిఐలు, ఎసైలు, ఫిసరీస్, ఆర్.అండ్.బి అధికారులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని మహిళ మృతి - నలుగురికి గాయాలు

పుత్తూరురూరల్, డిసెంబరు 24 ప్రభాతవార్త:



కారు ఢీకొని ఓ మహిళ మృతి చెందగా నలుగురికి గాయాలైన సంఘటన పుత్తూరు మండల పరిధిలో మంగళవారం జరిగింది. సీఐ సురేంద్రనాయుడు కథనం మేరకు... తమిళనాడుకు చెందిన నవనీతకృష్ణన్(44), అతని తండ్రి పళనిస్వామి(75), తల్లి సీతాలక్ష్మి(65), భార్య వైష్ణవికాళి(35), రెండున్నర సంవత్సరం కుమార్తె కుటుంబ సభ్యులతో కలసి చెన్నై నుంచి కారులో తిరుమల దైవ దర్శనానికి వెళ్లారు. దైవ దర్శనం అనంతరం మంగళవారం తిరిగి చెన్నైకి ప్రయాణమయ్యారు. ఈ నేపథ్యంలో పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం వద్ద కారు డీవైడర్‌ని ఢీకొనింది. దీంతో రోడ్డు పక్కనే ఉన్న పరమేశ్వం మంగళం దళితవాడకు చెందిన ఐలయ్య భార్య శాంతమ్మ(60)ని ఢీకొనింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు శాంతమ్మను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. అనంతరం కారులో ప్రయాణిస్తున్న కుటుంబ సభ్యులు గాయపడడంతో వారిని చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి

# జాతీయ హోదాకు సిఫార్సు

- -నడకదారిభక్తులకు మెరుగైన వైద్యసేవలు
- -రూ.3.36కోట్లతో వెలుపల క్యూలైన్ల మధ్యలో 6 టాయిలెట్ల బ్లాక్స్
- -భక్తులకు సులభమైన దర్శనం కల్పిస్తాం
- -టిటిడి బోర్డు నిర్ణయాలు



తిరుమల, డిసెంబర్ 24ప్రభాతవార్తప్రతినిధి:

ధార్మికసంస్థ టిటిడి విద్య, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి విస్తృతమైన సేవలందిస్తుండటంతో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యసేవలందిస్తున్న తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి జాతీయ హోదా కల్పించాలని టిటిడి బోర్డు సిఫార్సు చేసింది. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధంచేసి, సమగ్రసమాచారంతో నివేదికలను రాష్ట్రప్రభుత్వం ద్వారా కేంద్రానికి పంపాలని టిటిడి బోర్డు విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే పలు విభాగాల్లో నాణ్యమైన, మెరుగైన వైద్యసేవలందిస్తున్న స్విమ్స్‌కు జాతీయ స్థాయి హోదా లభిస్తే పేదలకు మరింత విస్తృతంగా వైద్యసేవలందించడానికి వీలవుతుంది. కాలినడక మార్గాల్లో తిరుమలకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్యసౌకర్యం అందించేందుకు అవసరమైన సివిల్ సర్జన్లు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది ,అత్యాధునిక వైద్యపరికరాలు ఏర్పాటుకు బోర్డు ఆమోదం తెలిపింది.. కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహిస్తున్న సాంప్రదాయ పాఠశాలకు ఎస్వీ విద్యాదాన ట్రస్ట్ నుండి 2కోట్లు రూపాయలు ఆర్థిక సాయం చేసేందుకు బోర్డు ఆమోదం. అన్నమయ్యభవనంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన ధర్మకర్తలమండలి సుదీర్ఘ సమావేశం జరిగింది. టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ శ్రీధర్, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, బోర్డు సభ్యులతో కలసి పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. తిరుమలలో ఇప్పుడు నడుస్తున్న పెద్ద హోటళ్ళు, జనతాక్యాంటీన్లను గుర్తింపుపొందిన హోటళ్ళ యాజమాన్యంకు అప్పగించి, తక్కువ ధరకే మంచి ఆహారం అందించేలా చర్యలు తీసుకోనున్నారు. తిరుమలకు వస్తున్న భక్తులకు దర్శనం, వసతి సౌకర్యాల్లో ఇబ్బంది లేకుండా చూడాలని, సులభమైన దర్శనం చేయించేందుకు సూచనలు అమలుచేసేదిశగా బోర్డు తీర్మానించింది. తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య రెట్టింపవుతుండటంతో ఆలయం వెలుపల క్యూలైన్లు విస్తరించాయని, ఇందుకుతగ్గట్లు భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ఆళ్వార్ ట్యాంకు విశ్రాంతి భవనాల నుండి బాటగంగమ్మ ఆలయం కూడలి మధ్యలో 3.36కోట్ల రూపాయలతో 6 టాయిలెట్ బ్లాక్స్ నిర్మించేందుకు ఆమోదం తెలిపారు. శ్రీలక్ష్మీశ్రీనివాస మేన్ పవర్ కార్పొరేషన్ ద్వారా మరిన్ని కాంట్రాక్టు సిబ్బంది నియామకం చేయాలని తీర్మానించారు.

## స్థానికుల సమస్యల పరిష్కారంలో ప్రత్యేక దృష్టి

### -టిడిపి నేతలకు టిటిడి ఛైర్మన్ హామీ



దేవుడ్ని నమ్ముకుని ఏళ్ళతరబడి తిరుమలలో నివాసముంటున్న స్థానికులకు మంచి చేయాలని, గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలో అనేక బాధలు, ఇబ్బందులుకు గురయ్యారని టిడిపి నేతలు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు విన్నవించారు. స్థానికులు లైసెన్స్‌తో దుకాణాలు ఏర్పాటుచేసుకుని వ్యాపారాలు చేసుకున్నా గతంలో వైసిపి నేతలు, అప్పటి బోర్డు పెద్దలు పలు రకాలుగా వేధించారన్నారు. అనధికార హాకర్లు, తట్టలు అక్రమంగా పెట్టించారన్నారు. తిరుమలలో ఉంటున్న స్థానికులకు అనేక సమస్యలను ఈ సందర్భంగా మంగళవారం ఛైర్మన్ బిఆర్‌నాయుడును బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డితో కలసి టిడిపి నేతలు సుగుణమ్మ, నరసింహయాదవ్, ఆర్‌సి మునికృష్ణ, శ్రీధర్‌వర్మ, రామ్మూర్తిరాయల్, రాజుయాదవ్; శివషణ్ముగం సమస్యలను విన్నవించారు.

## మామిడిరైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపరచండి

### -టిటిడి ఛైర్మన్‌కు ఎంఎల్ఏ మురళీ వినతి



చిత్తూరు జిల్లాలో 4లక్షలు మామిడి రైతుకుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, ప్రతి ఏటా పంటచేతికి వచ్చే సమాయానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ తెలిపారు. తిరుమలలో అన్నప్రసాదాలు పంపిణీతో బాటు భక్తులకు మామిడిజ్యూస్ పంపిణీ చేయడం వల్ల నమ్ముకుని బ్రతుకుతున్న వారందరికీ ఆర్థిక ప్రయోజనం కలిగిస్తుందని ఎమ్మెల్యే సూచించారు. మంగళవారం తిరుమలలోని బోర్డు సమావేశంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ శ్యామలరావును కలసి వినతిపత్రం అందించారు. ఇది భక్తులకు కూడా విశేష అనుభూతిని అందిస్తుందని అభిప్రాయం తెలిపారు. దీనిపై ఛైర్మన్ నాయుడు సానుకూలంగా స్పందించారని అన్నారు.

## గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి...

# దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

### కలెక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి కలెక్టరేట్, డిసెంబరు 24 ప్రభాతవార్త :

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌నందు జిల్లా కలెక్టర్ పీసీ,ఎన్‌డీటీ డిస్ట్రిక్ మల్టీ మెంబర్ అప్రాప్రియెట్ అథారిటీ కమిటి ఛైర్మన్ హోదాలో ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, పోలీస్ అధికారులు ఎన్జీవో తదితర కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ణారణ పరీక్షలు నిర్వహించి దుర్వినియోగం చేయరాదని, సదరు స్కానింగ్ పరీక్షల ద్వారా గర్భస్థ శిశువు ఎదుగుదల పరిశీలించుటకు మాత్రమే వినియోగించాలన్నారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ డెకాయ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. విన్స్ ఎన్జీవో మాట్లాడుతూ ఆడపిల్లలపై చిన్న చూపు పోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో కమిటీ కన్వీనర్ డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, డీఎస్పీ శ్రీలత, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిని శాంతకుమారి, డాక్టర్ శ్రీనివాసులు, డెమో, విన్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మీరా, తదితరులు పాల్గొన్నారు.

## 6200 లీటర్ల సారా ఊట ధ్వంసం

### – అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శ్రీనివాసాచారి



నగరి, డిసెంబరు 24 ప్రభాతవార్త:

నగరి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని నగరి, నింద్ర, విజయపురం మండలాల్లో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్ఈబీ అధికారులు మంగళవారం విస్తృత దాడులు నిర్వహించారు. ఉదయం నుంచిసాయంత్రం వరకు అడవులు, కొండ గుట్టలను గాలించి సారా ఊటలను ధ్వంసం చేయడంతో పాటు పాత ముద్దాయిల ఇళ్ళను సోదా చేసి సారా నిల్వ ఉంచుకున్న వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి మాట్లాడుతూ సారా లేని సమాజాన్ని సృష్టించడమే లక్ష్యంగా సారాపై విస్తృత దాడులు నిర్వహిస్తున్నామన్నారు. సత్రవాడలో రాజగుంట వద్ద మూడు స్థలాల్లో దాచి ఉంచిన 5200 లీటర్లసారా ఊటను కనుగొని ధ్వంసం చేశామన్నారు. ఇంటి వద్ద 10 లీటర్ల సారాను నిల్వ ఉంచిన సంపత్ అనే వ్యక్తిని అరెస్టుచేయడం జరిగిందని, అలాగే నింద్ర మండలం కొప్పేడులో వంద లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశామన్నారు. నాటు సారాసంబందిత విషయాలు తెలిస్తే 9440902549 నెంబర్‌కి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ దాడుల్లో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, నగరి సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎన్‌ఫోర్స్ మెంట్ టీం, ఈఎస్‌టీఎఫ్ టీం, నగరి, పుత్తూరు, నాగలాపురం స్టేషన్ హౌస్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

### - పట్టించుకోని అధికార యంత్రాంగం

నాయుడుపేట/చిట్టమూరు, డిసెంబర్ 24 ప్రభాతవార్త



నాయుడుపేట, చిట్టమూరు మండలాల్లోని పలు గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా, అధ్వానంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పురవీధులు, ఇళ్ల మధ్య ఉన్న మురుగు నీటితో దుర్వాసనతో పాటు దోమల ఉత్పత్తి స్థావరాలుగా మారుతున్నాయి. గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు కేటాయించి ఆయా గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజిలకు పెద్దపీట వేసిన అధికారులు, పాలకుల్లో మార్పు కనిపించడం లేదు. పారిశుధ్య పనులకు అధిక నిధులు విడుదల చేస్తున్నా, వాటిని ఉపయోగించాలనే ఆదేశాలను ఇస్తున్నా కొందరు సంబంధిత అధికారులు, నాయకులు చేతులు కలిపి, ప్రజల బాగోగులను నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు పలు రోగాల బారిన పడే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు, నాయకులు గ్రామ పారిశుధ్యంపై దృష్టి సారించి, పల్లె ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని నాయుడుపేట, చిట్టమూరు మండలాల ప్రజలు కోరుతున్నారు.

## జిల్లా సమగ్రాభివృద్ధిలో

# బ్యాంకుల పాత్ర కీలకం

### - కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, డిసెంబర్ 24 ప్రభాతవార్త:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి ప్రైవేటు బ్యాంకులైన హెచ్‌డిఎఫ్‌సి, కోటక్, ఐసిఐసి ఇతరత్రా బ్యాంకులు నిర్ధేశించిన లక్ష్యాలు ఎందుకు పూర్తి చేయడం లేదని కలెక్టర్ సుమిత్‌కుమార్ బ్యాంకర్లను ప్రశ్నించారు. జిల్లా సమగ్రాభివృద్ధిలో బ్యాంకుల పాత్ర కీలకమని ఆ దిశగా బ్యాంకులు పని చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం డిసిసి, డిఎల్‌ఆర్‌సి సమావేశం లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక రంగాలైన వ్యవసాయ రంగంలో రైతులకు పంట పెట్టుబడిగా అవసరమైన పంట రుణాలు, షార్ట్ టర్మ్ క్రాప్ ప్రొడక్షన్ రుణాలు మంజూరుల ప్రతి బ్యాంకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయడంలో ప్రైవేటు బ్యాంకులు అనాసక్తి చూపుతున్నాయన్నారు. పంట సాయం పెట్టుబడి కోసం రైతులు ఇబ్బంది పడకుండా అవసరమైన రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జిల్లా వ్యవసాయ, పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందడంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాల ద్వారా మేలు జరిగేలా అర్హు లైన లబ్దిదారులకు రుణాలు మంజూరు చేయాలన్నారు.

# యువతి ఆత్మహత్య



రేణిగుంట, డిసెంబర్ 24 ప్రభాతవార్త

రేణిగుంట పట్టణం వి.యం వీధిలో హాశిత (22) మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు రేణిగుంట పట్టణానికి చెందిన హాశిత ఎంబీఏ చదివింది. ఇటీవలే చదువు నిమిత్తం లండన్ కు వెళ్లి వచ్చింది. తల్లితండ్రులు బజారులో పుస్తకాల షాపు నిర్వహిస్తున్నారు. తల్లి షాపువద్ద ఉంటే తండ్రి ఇంటి వద్ద, తండ్రి షాపులో ఉంటే తల్లి ఇంటి వద్ద ఉంటారు. సాయంత్రం తండ్రి ఇంట్లో ఉండగా అమ్మాయి వేరొక గదిలో లోపల గడియ పెట్టి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి షాప్‌కు వెళ్లడంతో తల్లి ఇంటికి వచ్చింది. కుమార్తె కోసం వెళ్లిగా గది లోపల గడియ పెట్టి ఉంది. ఎంత తలుపు కొట్టిన తలుపు తెరవక పోవడంతో కంబైన్డ్ బాత్రూమ్ లోకి వెళ్లి తలుపులు గట్టిగా ప్రయత్నించి తెరిచి గదిలోకి వెళ్లారు. గదిలో ఆమెచీరకు వేలాడుతూ కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అర్బన్ సీఐ శరత్ చంద్ర ఆదేశాలతో అర్బన్ అరుణ్ కుమార్ రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లారు. అప్పటికి ఆమె మృతి చెందింది. సీఐ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసమూర్తి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలు తెలియలేదు. కుమార్తె మృతిని జీర్ణించుకోలేక తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

**సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి.**

## పరి'శ్రమ' పేదోడిది...

# ఆదాయం పెద్దోడిదా...!

### - గత ప్రభుత్వంలో అనర్హులకు పరిశ్రమల మంజూరుకు అనుమతులు

### - రూ. కోట్లు గడించి...కొంత మంది బోర్డులు తిప్పేసిన వైనం

తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్త :

గత ప్రభుత్వంలో తిరుపతి జిల్లాలో చిన్న, మధ్య, పెద్ద తరహా పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసినట్లు, అర్హులు అర్జీలు పెట్టుకుని పలు పర్యాయాలు జిల్లా పరిశ్రమల, సంబంధిత అధికారుల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరిగినా అందని ద్రాక్షలా మారాయని బాధితుల నుంచి వినిపిస్తున్న సమాచారం. అనర్హులకు పెద్ద పీట వేసి రూ. వేల కోట్లు ప్రభుత్వానికి గండి కొట్టారని చెప్పక తప్పదు. ఒకానొక దశలో టీటీడీ, ప్రభుత్వ విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగుల భార్యలకు, వారి బంధువులకు పరిశ్రమల పేరుతో రూ. కోట్లు విలువ జేసే ప్రభుత్వ భూములను కమీషన్లు, లంచాలకు... మామూళ్ళకు పాల్పడి కేవలం ప్రభుత్వ నామినల్ ధరలకే పెద్దోళ్ళకు కట్టబెట్టారు. పేదోడిన్ని ఆర్థికంగా ముందుకు తీసుకురావాల్సిన గత ప్రభుత్వం, నాటి జిల్లా పరిశ్రమల అధికారులు, సంబంధిత సిబ్బంది రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనర్హులకు అండగా నిలిచి వారికి రూ. కోట్లు ఆదాయం కల్పించే కామధేనువుగా పేదోడి పరిశ్రమ ఈ విధంగా మారడం విడ్డూరంగా ఉందని బాధితుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. .అంతేకాకుండా కొంత మంది అనర్హులు ప్రభుత్వం నుంచి చిన్న, మధ్య, పెద్ద తరహా పరిశ్రమల పేరుతో నాటి ప్రభుత్వం, సంబంధిత జిల్లా పరిశ్రమల, సంబంధిత అధికారుల నుంచి ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ రుణాలు మంజూరు చేసుకుని వారికి నచ్చిన విధంగా ఆ పరిశ్రమలను మార్చివేసినట్లు బాధితుల నుంచి వినిపిస్తున్న విశ్వశనీయ సమాచారం. ఒకరైతే ఏకంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి రూ.కోట్లకు అమ్మి సొమ్ము చేసుకోవడం జరిగిందని, మరి కొంత మంది చెత్తా చెదారం, ఫ్లాస్టిక్ వస్తువులు, ఇతరత్రా వస్తువుల తయారీ కేంద్రాలుగా మార్పులు చేయడం, ఇంకొంత మంది ఆ పరిశ్రమలను లీజులకు ఇచ్చి ప్రతి నెల అద్దెలు పెద్ద మొత్తంలో వసూలు చేసుకుంటున్నారని, ఇంకొంత మంది ఖాళీగా రూములు కట్టి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన ఉంచారని, అక్కడ ఎటువంటి పరిశ్రమలు నడపడం లేదని, ఏకంగా మరికొంత మంది ఒక పేరుతో పరిశ్రమ మంజూరు చేసుకుని వారికి తోచిన వ్యాపారలావాదేవీలు చేసుకుంటున్నారని, ఇంకొంత మంది దర్జాగా బహుళ అంతస్తులు కట్టుకుని కాపురాలు ఉంటున్నారని బాధితుల నుంచి ఆరోపణలున్నాయి. కలెక్టర్ తిరుపతి జిల్లా పరిశ్రమల విభాగంపై ప్రత్యేక దృష్టి పెట్టి తగు విచారణలు జరిపి అసలైన పేదవాడికి, అలాగే తిరుపతి జిల్లాలో అర్హులను గుర్తించి వారిని ఆర్థికంగా ఆదుకుంటారని బాధితులు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ముచ్చటగా మూడోసారి

# కార్‌పార్కింగ్ టెండర్ రద్దు

### కాంట్రాక్టర్ల రాజీ: దేవాదాయశాఖ విముఖత



శ్రీకాళహస్తి, డిసెంబర్ 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో పనులు, లీజులు ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే ఆ అధికార పార్టీ అనుయాయులకు కామధేనుగా మారింది. ముఖ్యంగా ఆదాయ మార్గాలు వచ్చే పనులకు సంబంధించి దక్కించుకొనుటకు ఎన్ని మార్గాలు ఉంటే అన్ని మార్గాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కార్‌పార్కింగ్ టెండర్ కథ నడుస్తుంది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే వాహనాల పార్కింగ్‌కు సంబంధించి ఫీజుల వసూలును గతంలో మున్సిపాలిటి, దేవస్థానం వేర్వేరుగా వసూలు చేసే వారు. అయితే గతంలో శాసనసభ్యుడుగా, మంత్రిగా ఉన్న బొజ్జల గోపాలకృష్ణారెడ్డి రెండు శాఖలకు ఫీజులు చెల్లించాలంటే వచ్చే భక్తులు ఇబ్బంది పడతారని భావించి దేవస్థానం పార్కింగ్ ఫీజులు వసూలు చేసుకుంటూ మున్సిపాలిటికి వచ్చిన ఆదాయంలో 40శాతం ఇవ్వాలని ప్రభుత్వం నుంచి జీవో తెచ్చారు.

**కరోనా కాలం నుంచి గాడితప్పిన టెండర్ల వ్యవస్థ:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన కార్‌పార్కింగ్ టెండర్ల వ్యవస్థ కరోనా కాలం నుంచి గాడితప్పింది. 2020లో కార్‌పార్కింగ్ ఫీజుల వసూలు టెండర్‌ను దక్కించుకున్న కాంట్రాక్టర్ తనకు నష్టం వచ్చిందంటూ కోర్టుకు వెళ్ళారు. అప్పటి నుంచి వ్యవస్థ గాడితప్పింది. మూడేళ్ళుగా దేవస్థానమే పార్కింగ్ ఫీజులను వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం రోజుకు కనీసంరూ.70వేలు వసూలు చేస్తున్నారు. అలాగే రద్దీ రోజుల్లో రోజుకు లక్ష దాటుతుంది. సరాసరి ఏడాదికి రూ.2.6కోట్లు ఆదాయం వస్తుంది. అంటే దేవస్థానం ఖచ్చితంగా కాకుండా వసూలు చేస్తేనే అంత ఆదాయం వస్తుంది. అయితే కాంట్రాక్టర్లు టెండర్ పాడుకుంటే కనీసం ఏటా రూ.3కోట్లు వస్తుందని అంచనా. దాంతో దేవాదాయశాఖ శాఖ కనీసం రూ.1.5కోట్లుకు పైగా టెండర్ వస్తేనే అనుమతించాలని నిర్ణయించింది. గతంలో రెండు సార్లు ఎన్వియస్ఎన్‌మూర్తి ఉన్నపుడు టెండర్లు పిలిచారు. కానీ దేవస్థానం ఆశించిన మొత్తం రాలేదని రద్దు చేసారు.

**టెండర్ల కోసం పైరవీలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో పార్కింగ్ ఇతర లీజులను ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే వారి అనుయాయులకు కట్టబెట్టడానికి పాలకులు దొడ్డిదారి విధానాలను అనుసరిస్తున్నారు. అయితే టెండర్లను దక్కించుకొనుటకు రక రకాల విధానాలను అనుసరిస్తున్నారు. ఆన్‌లైన్ టెండర్లు అయినా మరో లైన్‌లో దక్కించుకొనుటకు ప్రణాళికలు రూపొందించుకొని దక్కించుకొనుటకు ప్రయత్నిస్తున్నారు. 15రోజుల క్రితం కార్‌పార్కింగ్‌కు సంబంధించి టెండర్లు పిలిచారు. దానికి ఇ ప్రోక్యూర్‌మెంట్‌లో ఒకటి, సీల్డు టెండర్లు 3 వచ్చాయి. అయితే అదికారుల అంచనా మేరకు రాబడి రాలేదు. అయితే టెండర్ విధానంలో కూడా అధికారుల తీరు ప్రశ్నార్థకంగా మారింది. సాధారణంగా టెండర్లతో పాటు బహిరంగ వేలం వేసే విధానం ఉండేది. కానీ ఎందుకో ఆ దిశగా అధికారులు వ్యవహరించలేదనే విమర్శలు ఉన్నాయి. అంతేకాక టెండర్లకు సంబంధించి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టెండర్ల విధానాలకు సంబంధించి ఇఓను నిలదీసి నట్లు సమాచారం. ఎట్టకేలకు అధికారులు టెండర్లను రద్దు చేసారు. మళ్ళీ టెండర్లు పిలవటానికి సిద్ధం చేస్తున్నారు. అధికారులు ఎన్ని సార్లు పిలిచినా టెండర్ నోటీసులు ముద్రణకు చార్జీలు తప్ప రాజకీయ నాయకులు ప్రమేయం ఉన్నంత వరకు ప్రయోజనం లేదన్నది అధికారులకు తెలియనిది కాదు. మరి శివయ్యే నిర్ణయించాలి.

